క్లుప్తంగా

కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వివిధ కాలనీలతో పాటు, గ్రామాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రవీందర్ కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో, కాలనీల్లో కదలికలపై అనుమానాలు ఉంటే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 100కు కాల్ చేయాలని, లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వేసవిలో ఆరుబయట నిద్రించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అచ్చంపేట పట్టణంలో బొడ్రాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నందున ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నాయని, వాహనదారులు సహకరించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక


గోవర్ధన్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు నూతన అధ్యక్షులుగా కే గోవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా గంప శీను, కోశాధికారిగా శ్రీనివాసరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు క్లబ్ ప్రచార కార్యదర్శి పాషా తెలిపారు. మాజీ గవర్నర్లు చెన్న కిషన్ రెడ్డి, జూలూరు రమేష్‌బాబు, నరేందర్‌రెడ్డి, ఐ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డిల సమక్షంలో నూతన కమిటీని ఎన్నిక చేసినట్లు తెలిపారు. సంవత్సరం కాలం పాటు వీరు బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు.

కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

లింగాల: జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ క్రీడామైదానంలో నెలరోజుల పాటు నిర్వహించే కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం గురువారం సీనియర్ క్రీడాకారుడు నల్గొండ పెంటయ్య, సీనియర్ పాత్రికేయుడు సత్యనారాయణరావు ప్రారంభించారు. వేసవిలో విద్యా సంస్థలకు సెలవులు కావడంతో విద్యార్థులకు ఈ శిక్షణ శిబిరం ఎంతగానో దోహదపడుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ ఎండీ.అబ్దుల్లా, లయన్స్ క్లబ్ మండల శాఖ అధ్యక్షులు కొత్త రామకృష్ణ, పాత్రికేయుడు హెచ్‌ఎ. అశోక్, పీఈటీలు నవీన్, హరీష్, సీనియర్ ఆటగాళ్లు ప్రశాంత్, సంతోష్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో గురువారం జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం ఉచిత వేసవి క్రీడల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి క్రీడలను విద్యార్థులు అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు జయసింహారెడ్డి, కోచ్ భరత్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

చారకొండ: మండల కేంద్రంలో రోడ్డు మరమ్మతుల కారణంగా విద్యుత్ లైన్ పనులు చేపట్టడంతో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జానకీరామ్ నాయక్ ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈఈ కోరారు.

మహిళ అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ అదృశ్యం కావడంతో గురువారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన నవ్యలక్ష్మికి గురువారం భర్తతో గొడవ చోటు చేసుకోవడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోచింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం అందిస్తున్న అథ్లెటిక్స్ సమ్మర్ కోచింగ్ క్యాంపును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోచ్ దేవేందర్, ఖిల్లాఘనపురం గ్రామ పెద్దలు ఆగారం ప్రకాష్, తోక బుచ్చిబాబుగౌడు, డాక్టర్ వెంకటేష్‌లు అన్నారు. మండల కేంద్రంలోని మినీ స్టేడియం లో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంపును గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్యాంపు ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 8 నుండి 14 సంవత్సరాల బాలబాలికలకు మే 1 నుండి జూన్ 06వ తేది వరకు క్యాంపులో కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రీడల్లో రాణించాలనుకునే బాలబాలికలకు ఈ క్యాంపు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ క్రీడాభిమానులు రామకృష్ణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన అరుణ పతాకం

- ఘనంగా మే డే వేడుకలు
- 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి' అంటూ నినదించిన కార్మికులు
- ఎర్రజెండాలు ఎగరేసిన కార్మిక సంఘాల నేతలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలో 'ప్రపంచ కార్మికులారా.. ఏకంకండి' అంటూ కార్మిక సంఘాల నాయకులు కార్యకర్తలు కదం తొక్కారు. మేడే సందర్భంగా ఎర్రజెండాలు చేతబూని ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. కార్మిక సంఘాల ఆఫీసులు, ముఖ్య కూడళ్లలో ఎర్రజెండాలు ఎగరేశారు.


నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

➩ నాగర్‌కర్నూల్ పట్టణంలో ఆటో స్టాండ్ దగ్గర ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల్‌నర్సింహ ఎర్రజెండాను ఆవిష్కరించారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

➩ తిమ్మాజిపేట మండల కేంద్రంలో బాల్‌నర్సింహ మేడే జెండాను ఆవిష్కరించారు.

➩ అచ్చంపేటలో సీపీఎం, సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఆయా పార్టీల, కార్మిక సంఘాల జెండాలను ఆవిష్కరించారు.

➩ కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం, యూటీఎఫ్ కార్యాలయం, భవన కార్మికుల సంఘం కార్యాలయం, ఎల్‌ఐసీ, ఆర్టీసీ బస్‌డిపో ఎదుట ఆయా సంఘాల నాయకులు ఎర్రజెండాను ఎగరేశారు. తర్నికల్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

➩ దోమలపెంటలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి, అక్కడ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈగలపెంటలో సీపీఐ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు.

➩ లింగాలలో సీపీఐ ఆధ్వర్యంలో జెండాను ఎగుర వేశారు.

➩ కొల్లాపూర్ పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ముందు ఏఐటీయూసీ జెండాను తప్పెట కిరణ్‌కుమార్, మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ జెండాను ఈశ్వర్‌లు ఆవిష్కరించారు.

➩ తెలకపల్లిలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఎర్ర జెండా ఎగరవేశారు.

➩ వెల్దండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 1104యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా జెండాను ఎగరేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు.

➩ ఉప్పునుంతల మండల కేంద్రంలో సీఐటీయూ, హమాలీ సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి పోచమ్మ చౌరస్తా వరకు ర్యాలీ చేసి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు.

➩ పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్, పెంట్లవెల్లి గ్రామాలలో ఈశ్వర్ సీపీఎం జెండాను ఎగరవేశారు.

➩ చారకొండ మండంలోని జూపల్లిలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు ఎగరేశారు.

➩ బిజినేపల్లి మండలంలో, పాలెం, వెల్గొండ గ్రామాల్లో ఎర్రజెండాను ఆవిష్కరించారు.

➩ అమ్రాబాద్, మన్ననూర్‌లో బస్టాండ్ ఆవరణలో సీఐటీయూ జెండాలను ఎగరవేశారు.

➩ కల్వకుర్తి పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట 1104 యూనియన్ సబ్ డివిజన్ అధ్యక్షుడు నర్సిరెడ్డి జెండాను ఎగరవేశారు.

➩ కోడేరు మండల కేంద్రం, జనుంపల్లి, తీగలపల్లి, రాజాపూర్ గ్రామాల్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.



జటప్రోల్‌లో..


జూపల్లిలో ఘనంగా మేడే వేడుకలు


ఉప్పునుంతలలో..


తిమ్మాజిపేటలో మాట్లాడుతున్న బాలనర్సింహ


అచ్చంపేటలో సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


కల్వకుర్తి గోదాం వద్ద జెండా ఎగరేస్తున్న బాలయ్య


దోమలపెంటలో.


వెల్దండలో మాట్లాడుతున్న సాయిబాబా

గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు

ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లోనే వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తుందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఖానాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల కష్టం తెలుసని, అందుకే వారికి బోనస్ అందజేస్తుందన్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టేలా అధికారులు వ్యవహరించరాదని సూచించారు. రైతులకు సరిపోయినన్ని గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతయ్య, బాలరాజ్‌గౌడు, బంగారయ్య, రామన్‌గౌడు, గుబ్బ రాజు, నసీర్, రుక్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

70 వసంతాల వేడుకలు చేయడం సంతోషకరం

- పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మంత్రి జూపల్లి, ఎంపీ మల్లు రవి


ఎల్లూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి

కొల్లాపూర్ రూరల్: పూర్వ విద్యార్థుల 70 వసంతాల చేసుకోవడం సంతోషకరమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం మండంలోని ఎల్లూరు గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండురోజులు 70 వసంతాల వేడుకలకు మంత్రి జూపల్లి, ఎంపీ మల్లు రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1953 నుంచి 2024 వరకు గ్రామంలో చదివిన పూర్వ విద్యార్థులను సమీకరించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా అల్యూమిని కమిటీని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ.70 లక్షలు తన నిధుల నుంచి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో సంస్కృతిక భవనానికి రూ.40 లక్షలు, పాఠశాలలోని పెండింగ్ పనులకు రూ.30 లక్షలు ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ సమ్మేళనం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామంలోని పాఠశాలకు తన నిధుల నుంచి రూ.30 లక్షలు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ రమేష్ కుమార్, జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కమిటీ అధ్యక్షులు, సభ్యులు బ్రహ్మచారి, నీలంరెడ్డి, నిరంజన్, షబ్బీర్, బాలకృష్ణ, విజయేందర్, తదితరులు పాల్గొన్నారు.

'90 శాతం పనులు కేసీఆరే పూర్తి చేశారు'

తిమ్మాజిపేట: పాలమూర్-రంగారెడ్డి ప్రాజెక్టు పనులలో 90 శాతం పనులు కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే పూర్తి చేశారని, కాంగ్రెస్ హయాంలో కదలడం లేదని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జోగు ప్రదీప్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోపిగౌడ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 90 శాతం ప్రాజెక్టు పనులు పూర్తయినప్పటికి మిగతా 10 శాతం పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్‌కు మంచి పేరు వస్తుందనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేయడంలేదని ఆరోపించారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు ఉన్నారు.


తిమ్మాజిపేటలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


రైతులకు ఇబ్బందులు రానియొద్దు


రైస్ మిల్ వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడంతోపాటు, రైస్ మిల్లుల వద్ద రైతులకు ఇబ్బంది రాకుండా చూడాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హెచ్చరించారు. గురువారం సాయంత్రం పట్టణంలోని రైస్ మిల్లులో ఆయన ధాన్యం రైతులను కలిశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తాలు పేరుతో ఎనిమిది కేజీలు తీస్తున్నారని, తమకు నష్టం వస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే వెంటనే జిల్లా అడిషనల్ కలెక్టర్ అమరేందర్‌తో ఫోన్లో మాట్లాడారు. రైతులు చెప్పిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ధాన్యం తెచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్‌కు సూచించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులు పోటీ చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ ప్రభుత్వం కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రావ్ భవనంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు వికలాంగ నాయకులు పాల్నొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వికలాంగులు

రోడ్డు మధ్యన స్తంభం తొలగించాలి



పెద్దకొత్తపల్లి: దేవనితిర్మలాపూర్‌లో వనపర్తికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రావడానికి ఇబ్బందిగా ఉందని, విద్యుత్ అధికారులు తొలగించేందుకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశారు. లైను తీగలు రాకపోవడంతో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలో ఉండి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి రోడ్డు మధ్యనున్న స్తంభాలను తొలగించాలని గ్రామస్తులు శ్రీనివాసులు కోరారు.

పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఘన నివాళి



తెలకపల్లి: జమ్ముకశ్మీర్ పర్యటకులను పహల్గాంలో ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళులర్పించి ర్యాలీ చేశారు. గురువారం మండలంలోని కమ్మరెడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి సంఘటన జరగకుండా తీవ్రవాదాన్ని అంతం చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర నాయకుడికి సన్మానం



మన్ననూర్: ఆర్యవైశ్యుల అభివృద్ధి సంక్షేమం కోసం 20 ఏళ్లగా కృషి చేస్తున్న అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన జూలూరు సత్యనారాయణను ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత హైదరాబాద్‌లో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులలోని పేదల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సీఎం సహకారంతో ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆర్యవైశ్యులలో మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసేందుకు తన వంతుగా ప్రయత్నం చేస్తానని సత్యనారాయణ తెలిపారు.

నేడు దత్తలింగేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్టాపనోత్సవం



మరికల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన దత్తలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి విగ్రహాల ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చైతన్య, రాములు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా రెండు రోజులు పూజ కార్యక్రమాలు ముగిసిన తర్వాత మూడోరోజు శివపార్వతులు, కాలభైరవుడు, అభయాంజనేయ స్వామి, నవగ్రహా, నాగదేవతల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారులు మాట్లాడుతూ అర్హులైన వారందరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. బొల్లంపల్లితో పాటు ఆయా గ్రామాల్లో ఇంటింట తిరుగుతూ అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నింబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

ఉప్పునుంతల: ప్రభుత్వం నిబంధనల మేరకు అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇందిమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని ఎంపీడీఓ మోహన్‌లాల్ అన్నారు. మండలంలోని ఉప్పరిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓతో పాటు పంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఉన్నారు.


వెల్దండ మండలం బొల్లంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు

వైభవంగా విగ్రహాల ఊరేగింపు


శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి బొండ్రాయి, పోచమ్మతల్లి విగ్రహాల ఊరేగింపు

అచ్చంపేట: అచ్చంపేట పట్టణంలో బొడ్రాయి ఉత్సవాల సందర్భంగా రెండోరోజు గురువారం గ్రామ బొండ్రాయి, పోచమ్మతల్లి అమ్మవార్ల విగ్రహాలను ఊరేగించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ప్రత్యేక పూజలతో ప్రారంభమైన ఊరేగింపు పలకపల్లిరోడ్డు నుంచి వెంకటేశ్వర కాలనీ, మధురానగర్ కాలనీ, బస్టాండు ప్రధాన రోడ్డు గుండా వాటర్ ట్యాంకు, చెన్నకేశవ ఆలయం, లింగాల రోడ్డు వేంకటేశ్వరస్వామి ఆలయం, ఇంద్రానగర్, మహేంద్రనగర్, చౌటపల్లి రోడ్డు, పెద్దమ్మగుడి, ఉట్లకోనేరు, అంబేడ్కర్ చౌరస్తా, రాజీవ్‌చౌక్, మారుతినగర్, శ్రీరాంనగర్, వనపట్ల, అయ్యప్ప దేవాలయం, కూరగాయల మార్కెట్, సాయినగర్, పోచమ్మగుడి, పాత బస్టాండు మీదుగా శ్రీ భ్రమరాంబ ఆలయం వరకు కొనసాగింది. ఊరేగింపులో పట్టణ ప్రజలు దేవతలకు మంగళహారతుల పట్టారు. కలశం, బిందెలతో జలాభిషేకం చేశారు. సాయంత్రం 6గంటలకు యాగశాల వద్దకు చేరుకున్న దేవతల విగ్రహాలను సుగంధ ద్రవ్యాలతో జలాధివాసం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గార్లపాటి శ్రీనివాసులు, సతీష్, పి.మనోహర్, ఎ.గోపాల్‌రెడ్డి, మండికారి బాలజీ, శ్రీధర్, కొరివి శేఖర్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహాల సర్వేపై అభ్యంతరాలు

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ గృహాలపై గ్రామస్తులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ గురువారం ఎంపీడీఓ కథలప్పకు ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ కమిటీలు తప్పుదోవ పట్టించి గ్రామంలో ఇళ్లు ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, ఎలాంటి ఆధారం లేని లబ్ధిదారులను గుర్తించలేదని పేర్కొన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి అనర్హులను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఈర్ల భూపేష్‌బాబు, గంగనమోని జంగయ్య, కటికే శ్రీనివాసులు ఉన్నారు.


ఇందిరమ్మ ఇళ్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేస్తున్న వెల్గొండ గ్రామస్తులు

మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం

కల్వకుర్తి రూరల్: దేశంలో జన గణనతోపాటు కుల గణన చెప్పటాలని నిర్ణయం తీసుకోవడం పై గురువారం సాయంత్రం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మాట్లాడారు. కార్యక్రమంలో మేకల రాజేందర్, సదానందంగౌడ్, గోపాల్, రమేష్‌బాబు, శ్రీనివాస్ ఆచారి, సోమాజి, వేణుగోపాల్‌చారి, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ప్రధాని చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న నాయకులు

హజ్రత్‌జిందా షావలి గంధోత్సవం

నారాయణపేట ఎడ్యుకేషన్: మండలంలోని సింగారంలో హజ్రత్‌జిందా షావలి గంధోత్సవ వేడుకలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు సాగిన ఈ వేడుకల్లో భాగంగా మాజీ సర్పంచ్ కొత్తకాపు నాగిరెడ్డి ఇంటి నుంచి గంధోత్సవాన్ని గ్రామపుర వీధుల గుండా గ్రామ శివారులోని హజ్రత్ షావలి దర్గా వద్దకు చేర్చారు. దారి పొడువున మహిళలు నీళ్లు పోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం ఉదయం ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సిద్రామప్ప, సుధాకర్‌రెడ్డి, బస్వరాజ్, గౌస్, మున్నా, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

